క్లుప్తంగా

రేపు జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఖాదరబాద్ నర్సింగరావు ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 బాలబాలికలు, చెస్ బాల బాలికలు, షటిల్ బ్యాడ్మింటన్ బాలబాలికలకు, పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులందరూ క్రీడాకారులను సంబంధిత ఇన్‌చార్జి డీఫారం, ఆధార్ పత్రాలతో హాజరయ్యేలా చూడాలని సూచించారు.

ముగిసిన డీఎస్సీ ఉచిత కోచింగ్

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో శ్రీఖ్యాతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఏపీ పీఈటీ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన డీఎస్సీ ఉచిత కోచింగ్ ఆదివారం ముగిసిందని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ ఉచిత శిక్షణలో 400 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

పాటేల్ సినిమాను ఆదరించాలి



మాట్లాడుతున్న హీరో యువచంద్రకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 25వ తేదీన విడుదలవుతున్న పాటేల్ సినిమాను ఆదరించాలని హీరో యువచంద్ర కృష్ణ కోరారు. ఆదివారం పట్టణంలో చిత్రబృందం సందడి చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 25న సినిమా థియేటర్లలో విడుదల అవుతుందని, ప్రతి ఒక్కరు చూడాలన్నారు. యువతకు కావాల్సిన అన్ని అంశాలను దర్శకుడు సాహిత్ చక్కగా చిత్రీకరించారని తెలిపారు.

అర్టీసీ బస్సు – పికప్‌వ్యాన్ ఢీ

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం శివారులో కోవెలకుంట్ల డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సు, పికప్‌వ్యాన్‌లు శనివారం ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డ వైపు వస్తున్న పికప్‌వ్యాన్, ఆళ్లగడ్డ నుంచి కోవెలకుంట్ల వైపు వెళ్తున్న బస్సు భాగ్యనగరం మలుపు వద్ద ఢీ కొనడంతో రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరాతీశారు.

నేడు 'ఊరి విందు'

నంద్యాల(వ్యవసాయం): దసరా పండుగ అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అనవాయితీ మేరకు మన ఊరి విందు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, కాశీ అన్నపూర్ణ సత్రాల అధ్యక్షుడు భవనాశి వాసు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాల నుంచి మేళతాళాలతో తొమ్మిది పీఠాలు ప్రతి ఆర్యవైశ్య కుటుంబం ఇంటి వద్దకు వెళ్లి పూజలు అందుకుంటాయన్నారు. సోమవారం ఉదయం వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించిన అనంతరం వాసవి మాతకు ప్రత్యేక పూజలు జరిపించి వజ్రాల చీర అలంకరించబడి భక్తులకు దర్శనమిస్తుందన్నారు. ఊరువిందు కార్యక్రమంలో పట్టణంలోని దాదాపు 20వేల మంది ఆర్యవైశ్యులు పాల్గొంటారని చెప్పారు.

రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో పీడీ

రుద్రవరం: తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరచారని పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 కుస్తీ పోటీల్లో పాఠశాలకు చెందిన పావననాగ దినేష్, సాయి కుమార్, శశిధర్ బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. విద్యార్థులు, పీడీ శ్రీనివాసులును అభినందించారు.

వాలీబాల్ విజేత బాచేపల్లె జట్టు



విజేత బాచేపల్లె జట్టుకు ప్రైజ్‌మనీ అందజేస్తున్న దాత షేక్.మహమ్మద్

చాగలమర్రి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సిద్ధిఖ్ మెమోరియల్ టోర్నిలో బాచేపల్లె జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో చాగలమర్రి సిద్ధిఖ్–2 జట్టు, మూడో స్థానంలో ఖాజీపేట జట్టు నిలిచింది. విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేల నగదును దాతలు షేక్.మహమ్మద్, ఖలీల్, ఇర్షాద్, పీడి దాదాపీర్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు భార్గవ, షరీఫ్, అలీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో కాళికాంబదేవి



కాశిరెడ్డినాయనకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



బాలాజీ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకారంలో కోటా సుంకులాపరమేశ్వరి



బైటిపేట ఆంజనేయస్వామి

వైభవంగా దసరా వేడుకలు



సంజీవనగర్ రామాలయంలో అప్రికాట్, తకిపీ ఫ్రూట్స్ అలంకారంలో వేంకటేశ్వరస్వామి



దుర్గాదేవిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



చిన్నచెరువు కట్ట వద్ద అమ్మవారిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): దశమి తిథి, శ్రవణా నక్షత్రం రావడంతో శనివారం విజయదశమి వేడుకలను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. పండుగ రోజు ఉదయమే పట్టణంలోని పలు దేవాలయాలను పుష్పాలంకరణ గావించారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. లలితా సహస్ర నామామం, విష్ణు సహస్రనామం, వేదపారాయాణం నిర్వహించి చండీ హోమాన్ని పూర్ణాహుతి గావించారు. అమ్మవార్లను రాజరాజేశ్వరి దేవిగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మెయిన్‌బజార్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వజ్రాల చీరతో అలంకరించారు. బైటిపేట ఆంజనేయ స్వామి దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలు దేవాలయాల్లో సాయంత్రం శమీ వృక్ష దర్శనం కోసం భక్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. విజయదశమి రోజున శమీ వృక్షంనందు అమ్మవారు కొలువై ఉంటుందనే నమ్మకంతో భక్తులు సాయంత్రం శమీ వృక్షాన్ని దర్శించుకున్నారు. జమ్మి పత్రాలను పిల్లలు పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు పొందారు. ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం పట్టణంలోని అమ్మవారిశాల పీఠం, కాళికాంబదేవి పీఠం, శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర్లు, బ్రహ్మనందీశ్వరుల పీఠం, జగజ్జననీ దేవాలయాల, శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమం పీఠాలను గ్రామోత్సవం జరిపించారు. గ్రామోత్సవం గాంధీచౌక్, కల్పనా సెంటర్, కొత్త మసీదు, బైటిపేట ఆంజనేయస్వామి, బంగారు అంగళ్ల మీదుగా సాగింది. కామేశ్వరిదేవి సమేత మహానందీశ్వరస్వామి ఆదివారం ఉదయం శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకొని మహానందికి బయల్దేరారు.

భక్తి శ్రద్ధలతో దుర్గాదేవి నిమజ్జనం

నంద్యాల(వ్యవసాయం): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాల్లో, వీధుల్లో ఏర్పాటు చేసిన శ్రీదుర్గాదేవి విగ్రహాలను ఆదివారం భక్తి శ్రద్ధలతో స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద గల వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు. పదవ రోజు దశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. పట్టణంలో దాదాపు 20 అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

గోస్పాడు: దసరా పండుగను మండలంలో భక్తి శ్రద్ధలతో శని, ఆదివారాల్లో నిర్వహించారు. గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోస్పాడు, యాళ్లూరు, పసురుపాడు, సత్యానారాయణపురం తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి 9 రోజులపాటు పూజలు చేపట్టారు. ఆదివారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన లలితా దేవి అమ్మవారికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆదివారం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. అంతకు ముందు విగ్రహాలను ఊరేగించారు.



శమీ వృక్షాన్ని దర్శించుకుంటున్న భక్తులు









బంగారు చీర అలంకారంలో శ్రీవాసవీ మాత,యాళ్లూరులో అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం ,పసురపాడు, గోస్పాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలు



ఆళ్లగడ్డలో ప్రత్యేకాలంకరణలో వాసవీమాత



దొర్నిపాడులో విజయలక్ష్మీదేవిగా అమ్మవారు



శిరివెళ్లలో పూజలందుకుంటున్న శ్రీ కన్యకాపరమేశ్వరి దేవీ





ముత్యాలపాడులో శ్రీవిజయలక్ష్మీదేవిగా, భక్తులు విరాళంగా అందజేసిన చెక్క రథం



చాగలమర్రిలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



చాగలమర్రిలో మహిళల కోలాటం



ఉయ్యాలవాడలో శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ముగిసిన దసరా మహోత్సవాలు

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఉదయం దిగువ అహోబిలం దేవాలయ ప్రాంగణంలోని యాగశాలలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి సుప్రభాత సేవతో పూజలు మొదలు పెట్టి ప్రత్యేక విజయదశమి పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఉత్సవ మూర్తులకు నవకలశ పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించి నూతన పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేష ఆభరణాలలో అలంకరించి అడుగడునా అర్ఘపాద్య ఆచమణ, ధూపదీప ఉపహారాలు సమర్పించుకుంటూ విశేష పుష్పాలంకరణ గావించిన ఊయలలో విడివిడిగా కొలువుంచి, మహావీర్ నివేదన, లక్ష కుంభహారతి నీరాజనములు సమర్పించి, దివ్యప్రబంధ పారాయణాలు నిర్వహించారు.

విజయలక్ష్మీదేవిగా అమ్మవారు

పది రోజులుగా నియోజవర్గంలోని అమ్మ వారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా జరిగిన దసరా మహోత్సవాలు విజయ దశమిని పురస్కరించుకుని శనివారంతో వైభవోపేతంగా ముగిశాయి. చివరి రోజైన విజయదశమి సందర్భంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు పట్టణంలోని అమ్మవారిశాలలో కొలువైన శ్రీ వాసవీ దేవి అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

దొర్నిపాడు: దొర్నిపాడులో కొలువైన కన్యకాపరమేశ్వరీ అమ్మవారు విజయలక్ష్మీదేవిగా కొలువుదీరగా.. ఆదివారం వసంతోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు అంజనీప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నవరాత్రులు నిర్వహించారు.

ఉయ్యాలవాడ : దసరా పండుగను పురస్కరించుకొని ఉయ్యాలవాడలో అగస్త్రీశ్వర, శ్రీ కోదండ రామస్వామి, రామాలయం ఆలయాల్లో వెలిసిన శివపార్వతులు, సీతారాముల ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో కొలువులో వుంచి గ్రామోత్సవం చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శమీ వృక్షం వద్దకు ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా గ్రామస్తులు తీసుకెళ్లారు. వేద పండితులు భాస్కరశర్మ, రవికుమార్ శర్మ, మోహనకృష్ణలు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

శిరివెళ్ల : దేవీశరన్నవరాత్రుల ముగింపు వేడుకల్లో భాగంగా చివరి రోజు ఆదివారం కన్యకాపరమేశ్వరి దేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పండుగ రోజున వీరారెడ్డిపల్లెలో యువతులు బతుకమ్మ పండుగ ఆట పాటలను ఆడారు. వసంతోత్సవంతో గత 9 రోజులుగా భక్తిశ్రద్ధలతో జరిగిన వేడుకలు ముగిశాయి.

ఘనంగా విజయ దశమి వేడుకలు

చాగలమర్రి: మండల కేంద్రంలోని శ్రీకన్యాకాపరమేశ్వరిదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వంసత్సోవ కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. శనివారం అమ్మవారు శ్రీవిజయలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీలో గ్రామ పోలిమేరలో ఉన్న శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లి శమీదర్శనం చేయించారు. రాత్రి విద్యుద్దీపాలతో అలంకరించిన పల్లకీలో అమ్మవారు, శ్రీచెన్నకేశవ స్వామిని కొలువుంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, అమ్మవారిని పల్లకీలో గ్రామంలో ఊరేగించారు. ఆర్యవైశ్య యువకులు రంగుల చల్లుకొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబు, ఉపాధ్యాక్షులు బచ్చు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణ, కోశాధికారి కె.రామక్రిష్ణ వరప్రసాద్, శ్రీవాసవి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ ప్రహ్లాదవరదుడు



ఉభయ దేవేరులతో శ్రీ ప్రహ్లాదవరదుడి గ్రామోత్సవం

శాస్త్రోక్తంగా శమీ మహోత్సవం

ఆళ్లగడ్డ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో చివరిరోజైన విజయదశమి రోజు నిర్వహించే శమీ మహోత్సవానికి ప్రత్యేకస్థానం. ఇందులో భాగంగా దిగువన రాత్రి ఉభయ దేవేరుల సమేత శ్రీ ప్రహ్లాదవరదుడికి విశేష పష్పాలంకరణ గావించి ఉత్సవ పల్లకీని మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ గ్రామ శివారులోని జమ్మి చెట్టు వద్దకు చేర్చారు. అక్కడ సాంప్రదాయ ప్రకారం ఆయుధ పూజ నిర్వహించిన అనంతరం స్వామి వారి తరుపున అర్చకులు విల్లంబులను వదిలి సంబరాలు జరుపుకున్నారు. నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవారు వెళ్లే వనమహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించేందుకు దేశంలోని వివిధ ప్రదేశాలనుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో అహోబిలం గోవింద నామస్మరణతో పులకించి పోయింది.

ముత్యాలపాడులో..

ముత్యాలపాడు గ్రామంలో విజయదశమి రోజు శనివారం అమ్మవారు శ్రీవిజయలక్ష్మీదేవి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం సాయంత్రం అమ్మవారిని పల్లకీపై కొలువుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి శమీదర్శనం చేయించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, పల్లకీలో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కోసం భక్తులు విరాళంగా ఇచ్చిన టేకు రథాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీకన్యకాపరిమేశ్వరిదేవి పాన్పు సేవ కార్యక్రమంతో విజయదశమి వేడుకలు పూర్తయ్యాయి. కార్యక్రమంలో ముత్యాలపాడు గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముడియం నరసింహారావు, కోశాధికారి మాధవనరసింహ్మయ్య, ఉపాధ్యక్షులు రామకృష్ణ, మంచికంటి సురేష్‌బాబు, కార్యదర్శి గోపాలక్రిష్ణ, ఉప కార్యదర్శి వెంకటరమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ

నంద్యాల(అర్బన్): మండలంలో సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యక్రమాధికారి ఎంపీడీఓ సుగుణశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న కానాల, అయ్యలూరు, 15న బిల్లలాపురం, కొత్తపల్లి, 16న చాపిరేవుల, పుసులూరు, బ్రాహ్మణపల్లె, 17న పాండురంగాపురం, 18న చాబోలు, భీమవరం, రాయమాల్పురం, మునగాల, 19న పులిమద్ది, పోలూరు, మిట్నాల, గుంతనాల, 20న పెద్దకొట్టాలలో ఉంటాయని వివరించారు.

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తామని ఈఓఆర్‌డీ నాగఅనసూయ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 14న ఎం.చింతకుంట్ల, జూలెపల్లె, 15న పసురపాడు, తేల్లపురి, రాయపాడు, 16న గోస్పాడు, ఒంటివెలగల 17న ఎస్.నాగులవరం, నెహ్రూనగర్, జిలెల్ల, 18న యాల్లూరు, ఎం.కష్ణాపురం, 19న సాంబవరం, కానాలపల్లిలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

శిరివెళ్ల : ఈ నెల 14 నుంచి మండలంలో పల్లె పండుగ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఆదివారం తెలిపారు. 14న మహాదేవపురం, గుండంపాడు, బోయలకుంట్ల, 15న చెన్నూరు, కొట్టాలపల్లె, ఇసుకపల్లె, మోత్కులపల్లె, 16న శిరివెళ్ల, వెంకటేశ్వరపురం, ఖాదరబాదర గ్రామాలలో కార్యక్రమం ఉంటుందన్నారు. 17న వీరారెడ్డిపల్లె, కోటపాడు, 18న యర్రగుంట్ల, వెంకటాపురం, 19న గుంప్రామాన్‌దిన్నె, రాజనగరం, గాంధీనగరం. 20వ తేదిన జీనేపల్లె, వనికిదిన్నెలో నిర్వహిస్తామన్నారు.

ఆర్థికసాయం

శిరివెళ్ల : యర్రగుంట్ల గ్రామానికి చెందిన తలారి పుల్లయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరుపున సర్పంచ్ అయ్యాలూరి సుభహాన్, కాపు సంఘం నాయకుడు శంకర్, వార్డు మెంబర్ గుత్తి బాలరంగన్న, మహమ్మద్ రఫీ, ఖాజా రూ.11,వేలు అందజేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

దొర్నిపాడు: మండల కేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగిస్తుండటంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. శివ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకొని 23 సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. దాడుల్లో ఏఎస్‌ఐ ప్రతాపరెడ్డి, కానిస్టేబుల్ రాంబాబు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక రద్దు

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమాల సందర్భంగా గ్రామపంచాయతీల్లో వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

కక్షసాధింపుతోనే కేసులు

దొర్నిపాడు: ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెట్టడం ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపు చర్యేనని వైఎస్సార్ సీపీ మండల ప్రెసిడెంట్ బత్తుల నాగేశ్వర రావు యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల చాకరాజువేముల గ్రామంలో జరిగిన ఘర్షణకు సంబంధించి.. గొడవలు వద్దూ అంటూ ఇరువర్గాలను సముదాయించబోయిన వ్యక్తిపై ఓ మహిళతో కేసుపెట్టించడం సబబు కాదన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీలో ఉన్న భూమా చెంచిరెడ్డిపై కక్ష సాధింపుతోనే కేసుపెట్టించారన్నారు. గతంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలను పరిష్కరించారన్నారు. గత ఐదేళ్లలో దొర్నిపాడు సహకార సంఘం ప్రెసిడెంట్‌గా ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. టీడీపీ హయాంలో రూ.2.90 కోట్ల ఆదాయంలో ఉన్న సొసైటీని రూ.16 కోట్లకు తీసుకువచ్చారని గుర్తు చేశారు. పోలీసు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా విచారించి పెట్టిన కేసు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దసరా వేషాలు



నంద్యాల ఇండోర్ స్టేడియంలో కళాకారుల ప్రదర్శన



మున్సిపల్ టౌన్ హాల్‌లో వివిధ వేషధారణల్లో కళాకారుల ప్రదర్శనలు

నంద్యాల(వ్యవసాయం): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు దసరా వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతి ఏడాది ఆనవాయితీగా భద్రకాళి, శక్తి, మహిషాసురుడు, శివుడు, నాగకన్యలు, దున్నపోతు, రక్తబీజుడు తదితర వేషాల్లో అమ్మవారిని కీర్తిస్తూ చెడుపై విజయం సాధిస్తూ అమ్మవార్లు రాక్షసులను వధించే సన్నివేషాల ప్రదర్శించేవారు. ఈ ఏడాది బైటిపేట, ఉప్పరిపేట, దేవనగర్, పీవీనగర్, గుడిపాటి గడ్డ, తెలుగుపేట యువకులు గ్రూపులుగా విడిపోయి దసరా వేషాలు వేసి ప్రత్యేకను చాటుకున్నారు. దసరా వేషాల కళ అంతరించి పోకుండా నంద్యాల కమ్యూనికేషన్ కళారాధన ఆధ్వర్యంలో టౌన్‌హాల్‌లో నంద్యాల స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద విక్టోరియా రీడింగ్ రూం, ఇండోర్ స్టేడియంలో గంగిశెట్టి దీపక్, గుడిపాటిగడ్డ యూత్ ఆధ్వర్యంలో దసరా వేషాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుతిగా బాబు గ్రూప్‌కు రూ.50 వేలు, ద్వితీయ బహుమతి సనా గ్రూప్ రూ.30 వేలు, తృతీయ బహుమతి సురేష్ గ్రూప్ రూ.20 వేలు దక్కించుకున్నారు. గుడిపాటి గడ్డలో కౌన్సిలర్ దండె లక్ష్మిదేవి, సుధాకర్, కో ఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం, చందు, సుబ్బయ్య, గుడిపాటి ప్రసాద్ తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.